క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కొత్తపల్లి: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు, మండల నాయకులు పరుశురాం, కృష్ణుడు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద వారు విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్ నెల చివరి వారం నుంచి దాదాపు 7 వారాల బిల్లులు ఉపాధి కూలీలకు నేటికీ చెల్లించలేదన్నారు.

సమయానుసారం బయోమెట్రిక్ హాజరు వేయాలి

కొత్తపల్లి: సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ సమయానుసారంగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని ఎంపీడీఓ జవహర్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ఉదయం, సాయంత్రం తప్పకుండా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని చెప్పారు. సచివాలయాల్లో పనిచేస్తున్న అన్ని కెటగిరీల సిబ్బందికి బయోమెట్రిక్ అటెండెన్స్ ఆధారంగానే నెలసరి జీత భత్యములు చెల్లించబడుతాయని పేర్కొన్నారు.

నాగటూరు ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు


నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: నాగటూరు ఎత్తిపోతల పథకం నుంచి రైతులకు సాగునీరు సమృద్ధిగా అందిస్తామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగటూరు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ సీజన్‌లో సాగు నీరు అందించడం ఖాయమన్నారు. అన్ని రకాల పంటలకు వీలైనంత వరకు నీరు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు నవీన్, టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించండి


పింఛన్ ఇప్పించాలని కోరుతున్న తహసీన్

శ్రీశైలంప్రాజెక్ట్: ఆరోగ్యం సక్రమంగా లేని తహసీన్‌కు పింఛన్ మంజూరు చేయాలని మండల బీజేపీ నాయకులు సోమిశెట్టి మల్లికార్జున గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సున్నిపెంట గ్రామంలోని పూర్ణానందస్వామి ఆశ్రమం సమీపంలో నివశిస్తున్న కరీముల్లా, ఆశాబీ దంపతుల కుమార్తె ఎనిమిదేళ్ల ఎస్.కె.తహసీన్‌కు ఆ మధ్యనే ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగాలేకపోవడంతో, ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతోంది.

అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో అత్యధిక శాతం కార్మికులు, కూలీలు నివశిస్తున్నారని, సున్నిపెంట గ్రామంలో అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సూపర్‌మార్కెట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ రేటుకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం మండల డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు వై.శ్రీను, బాబు, సమద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుకండి


రక్తదానం చేస్తున్న సహకార సొసైటీ ఉద్యోగులు

నందికొట్కూరు: ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వహణాధికారి విజయ్‌కుమార్, డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సహకార బ్యాంకు ఆవరణలో అసోషియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 80 మంది రక్తం చేశారు. కార్యక్రమంలో డీజీఎం సునిల్‌కుమార్, సబ్‌డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు, రీజనల్ ఆఫీసర్ సంజీవకుమార్, బ్యాంచ్ మేనేజర్లు సరోజమ్మ, పులిరాజు, విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతి ప్రాచీన నాగరికతకు చిహ్నం


శ్రీశైలం : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రాచీన నాగరికతకు చిహ్నంగా, చిరస్థాయిగా ఉంటాయని ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ సురేంద్రబాబు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక మల్లికార్జున కల్యాణ మండపంలో ఆర్ఎస్ఎస్ సమావేశంలో పాల్గొన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా భగవత్ ధ్వజానికి నమస్కరించారు. మాజీ ప్రధానార్చకులు పీఠం మల్లయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

- పాఠశాలలు ప్రారంభమై నెలైనా అమలు కాని 'తల్లికి వందనం'
- ఫీజులు కట్టాలని ప్రైవేటు పాఠశాలల ఒత్తిడి
- పథకం నిధుల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు
- జీఓ 29తో పథకం అమలులో మెలిక పెట్టిన ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ పాలనలో అమ్మఒడే మేలనుకుంటున్న తల్లులు



టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో

తల్లికి వంచన!



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.

ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 29

ఆత్మకూరు: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు ఇంకా అమలుకు నోచుకోవడంలేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పేరుతో పిల్లలను బడికి పంపే తల్లుల ఖాతాల్లో జూన్ మాసంలోనే నగదు జమ చేసేవారు. అదే పథకాన్ని 'తల్లికి వందనం' అనే పేరుతో అమలు చేస్తామని, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పథకం వర్తిస్తుందని, ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున జమ చేస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి నెలరోజులు గడుస్తున్నా ఈ పథకం అమలుకు నోచుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పథకం కోసం ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది.

ఫీజుల కోసం ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల ఒత్తిళ్లు

శ్రీశైలం నియోజకవర్గంలో 36,068 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 1 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పథకం కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా వివిధ తరగతుల విద్యార్థులు ఫీజులు చెల్లించాలని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నారు. అలాగే వివిధ తరగతుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత విద్య కోసం టీసీలు కావాలని యాజమాన్యాన్ని అడిగితే ఫీజులు చెల్లిస్తేనే ఇస్తామని తెగేసి చెబుతున్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్‌లో చేరాలంటే టీసీలు తప్పనిసరిగా కావాలి. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం నిధులు జూన్ మాసంలోనే మంజూరుకావడంతో ఫీజులు చెల్లించేవారమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వం స్పందించి వెంటనే పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

కొత్త జీవోపై తల్లిదండ్రుల ఆగ్రహం

రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు జీవో నం.29 ప్రకారం ఇంట్లో కేవలం ఒక్కరికి మాత్రమే వర్తింపజేస్తామని చెప్పడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత కుటుంబంలో ఎంతమంది విద్యార్థులు అంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నేడు అధికారంలోకి రాగానే కేవలం ఒక్క విద్యార్థికి మాత్రమే రూ.15 వేలు చెల్లిస్తామని చెప్పడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అందరికీ తల్లి వందనం పథకాన్ని వర్తింపజేసి, నగదును చెల్లించాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద పూర్తి స్థాయిలో తల్లిదండ్రులు లబ్ధి పొందారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మ ఒడి చెల్లించినా సరైన సమయంలో నిధులు విడుదల చేసేవారని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

ఇచ్చిన హామీని అమలు చేయాలి



ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను తప్పని సరిగా నెరవేర్చాలి. మా ఇంటిలో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇందులో యువరాజు 5వ తరగతి, పూజిత 8వ తరగతి, తిరుమలేష్ 10వ తరగతి పూర్తి చేసి ఐటీఐకి వెళ్తున్నాడు. ఇద్దరు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో, ఒకరు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ముగ్గురు పిల్లలు పాఠశాలలకు వెళితే తమకు రూ.45 వేలు వస్తాయని ఎంతో సంబరపడ్డాను. కొత్త జీవో ప్రకారం ఒక విద్యార్థికే డబ్బులు అందిస్తానంటే కేవలం రూ.15 వేలు మాత్రమే వస్తాయి. మాట తప్పే సీఎంగా చంద్రబాబునాయుడు నిలిచిపోతాడు.

– పదాలమ్మ, ఏకలవ్యనగర్, ఆత్మకూరు

అప్పులు చేయాల్సి వస్తోంది



రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని విద్యార్థులకు త్వరగా వర్తింపజేయాలి. గత ప్రభుత్వ హయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం ద్వారా జూన్ మాసంలోనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమచేసేవారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరేమో ప్రైవేటు పాఠశాలలో, మరోకరు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాడక ముందు సీఎం చంద్రబాబు నాయుడు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15వేలు తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. జూలై రెండో వారం మొదలైనా ఇంకా ఈ పథకం ద్వారా నగదు జమకాలేదు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. పాఠశాల ఫీజులకు, పిల్లల ఖర్చులకు అప్పుచేసి బడికి పంపాల్సిన పరిస్థితి నెలకొంది.

– చరితమ్మ, గువ్వలకుంట్ల, కొత్తపల్లి మండలం

చెప్పిన ప్రకారంగా 'తల్లికి వందనం' ఇవ్వాలి



ఎన్నికల ముందు తెలుగుదేశం వారు చెప్పినట్లుగా బడిలో చదువుచున్న పిల్లలందరికీ తల్లికి వందనం ఇవ్వాలి. మా పిల్లలు ఇద్దరు షాహిద్, సాజిద్, పాములపాడు ఏపీ మోడల్ స్కూలులో 10వ తరగతి చదువుచున్నారు. ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున రూ.30 వేలు వస్తాయి. ఇప్పటికే మా బ్యాంకు ఖాతాలో వేయాల్సింది కదా. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. ఇది ఎంత మాత్రం కరెక్టు కాదు. పాఠశాలలు తెరిచిన వెంటనే డబ్బులేస్తే పిల్లలకు అవసరమైన మెటీరియల్ కొనుగోలు చేయడానికి ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు డబ్బులు వేయకపోతే ఎలా?. ఎన్నికల హామీ ని ఎలా నమ్మాలి?. గతంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభించిన వెంటనే డబ్బులు వేసేవారు. మరి ఇప్పుడు ఎందుకు వేయలేదు.

–ముబీన, పాములపాడు

అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధం


శ్రీశైలంలో అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ బుచ్చయ్య

వెలుగోడు: అధిక జనాభా దేశ ప్రగతికి అవరోధమని, దేశం అభివృద్ధి చెందాలన్నా.. కుటుంబం అభివృద్ధి చెందాలన్నా జనాభా నియంత్రణ ముఖ్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతమ్మ అన్నారు. స్టార్ యూత్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు సయ్యద్ చిన్న హుసన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ పద్మావతమ్మ మాట్లాడుతూ.. అధిక జనాభా పర్యావరణ వ్యవస్థకు, మానవాళి పురోగతికి తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందన్నారు. జనాభా పెరుగుదల వలన కలిగె నష్టాలపై అవగాహన పెంచుకోవాల్సిందిగా తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది జయరాజు, పట్టణ మహిళలు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య జనాభా పెరుగుదల వలన కలిగే నష్టాలను వివరించారు. సమావేశంలో అధ్యాపకులు శష్మ, డాక్టర్.ఎం.పద్మ, డాక్టర్.రాజన్న, డాక్టర్.శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానంది: అధిక జనాభా దేశప్రగతికి అవరోధమని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నూర్జహాన్

జూపాడుబంగ్లా: సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ బృందానికి అన్నిశాఖల అధికారులు సహకరించాలని ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ గౌరీబాయి సూచించారు. గురువారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ 01 నుంచి 31 మార్చి 2024 వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో రూ.7,81,01,665 ల నిధులతో 777 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్‌శాఖ, హౌసింగ్ డిపార్టుమెంటు తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ బృందం సభ్యులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోషల్ ఆడిట్ బృందం సభ్యులు తనిఖీలకు వచ్చినప్పుడు ఆయాశాఖల అధికారులు పనులకు సంబంధించిన రికార్డులు ఇవ్వడంతో పాటు చేసిన పనుల గురించి క్షుణ్ణంగా వివరించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ బషీర్, ఈసీ నజీర్‌బాషా, సోషల్ ఆడిట్ ఎస్సార్పీ కాంతయ్య, హౌసింగ్ ఏఈ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

శ్రావ్యశ్రీ | సోనీ | భరత్ | మానస | పసుపుల వరుణ్ | శ్రీనాథ్

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాల నుంచి ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు.అదేవిధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఒక విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సాయితిమ్మయ్య వెల్లడించారు. ఆదర్శ పాఠశాల నుంచి శ్రావ్యశ్రీ (591), సోనీ (582), భరత్ (580) ,మానస(578), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మూల మహేష్ (575) సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.


జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మహేష్‌ను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం సాయి తిమ్మయ్య, సిబ్బంది

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులు ఇద్దరు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నాగరవీంద్ర గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుపుల వరుణ్ నూజివీడు, శ్రీనాథ్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కాలేజీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

మహానంది: తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదివి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన డి. వహీదా(పదిలో 578 మార్కులు), జి.లలిత(574)లకు ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. వహీదాకు నూజివీడు, లలితలకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో స్థానం లభించిందన్నారు.

 
డి. వహీదా | జి.లలిత

పరిసరాల శుభ్రతతోనే డెంగీ నివారణ


కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు మహమ్మద్ బేగ్

కొత్తపల్లి: డెంగీ నివారణే వైద్య సిబ్బంది లక్ష్యమని వైద్యుడు మహమ్మద్‌బేగ్ అన్నారు. గురువారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ ప్రతి విద్యార్థిని అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే పరిశుభ్రంగా ఉండాలన్నారు. పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలకృష్ణ, సూపర్‌వైజర్లు గుర్రప్ప, దేవకరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేడి ఆహారాన్ని తీసుకోవాలి

డయేరియా బారిన పడకుండా ఉండాలంటే వేడి ఆహారాన్ని తీసుకోవాలని మండలంలోని పాలెంచెరువు గూడెంలో ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు గురువారం హెల్త్ డిపార్ట్‌మెంట్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డయేరియా నివారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరిత, అంగన్వాడీ టీచర్ లింగపుల్లమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వీడని చిరుత భయం

మహానంది: మహానంది, పరిసర ప్రాంత ప్రజలకు చిరుతపులి భయం వీడటం లేదు. తాజాగా బుధవారం అర్ధరాత్రి మహానందిలోని ఏపీ టూరిజం వెనుక వైపు సంచరించిందని స్థానికులు తెలిపారు. ఆలయం ఎదురుగా ఉన్న ఏపీ టూరిజం వసతి గృహాల వెనుక వైపు సుమారు అర్ధరాత్రి 12.30గంటల ప్రాంతంలో చిరుతపులి సంచరించిందని, అక్కడే ఉన్న ఓ కుక్కను వేటాడి తీసుకెళ్లిందని చెప్పారు. దీంతో పాటు తెలుగుగంగ కాల్వ కట్ట నుంచి కృష్ణనంది వెళ్లే మార్గంలో ఉన్న మామిడిచెట్ల తోటల వద్ద మరోసారి చిరుతపులి కనిపించినట్లు రైతులు చెప్పారు. తాజాగా గురువారం రాత్రి ఇటీవల యువకుడిని దాడి చేసిన ప్రాంతంలోకి వచ్చిందని స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతపులిని బంధించి సుదూర ప్రాంతాలకు తరలించి ప్రజల ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బాలికలు అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: బాలికలు నిత్యం అప్రమత్తంగా ఉంటూ ప్రతి విషయాన్ని తల్లిదండ్రులతో చర్చించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావని రెడ్డి సూచించారు. 'మిషన్‌శక్తి' కార్యక్రమంలో భాగంగా గురువారం జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రుతుస్రావం, వ్యక్తిగత పరిశుభ్రత, ఈవ్‌టీజింగ్, సామాజిక స్పృహ కలిగి ఉండటం అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్ చేసినా, తాకరాని ప్రాంతంలో తాకటం, వెకిలిగా ప్రవర్తించటం వంటివి చేస్తే తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే శివలక్ష్మి, అంగన్‌వాడి వర్కర్ సునీత పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మజరా గ్రామమైన కృష్ణానగర్‌లో నంద్యాల జిల్లా సగర సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ఇమ్మడి అపర్ణ జ్వరం, ఒంటినొప్పులు, వాంతులు, విరేచనాలు, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సుమారు 100 మందికి సేవలందించారు. కార్యక్రమంలో సగర వైద్యవిభాగ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రమేష్‌బాబు, గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, ఆవులయ్య పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

పగిడ్యాల: పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం పాత ముచ్చుమర్రి పశుగణాభివృద్ధి కేంద్రంలో పశువైద్యాధికారి రాగసంధ్య పశుగ్రాసం పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. పశుపోషకుల అభ్యున్నతికి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేసిందన్నారు. వ్యవసాయంతో పాటు రైతులు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే లాభసాటిగా ఉంటుందన్నారు. దాణా ఖర్చు తగ్గించుకోవడానికి పశుగ్రాస పెంపకం కచ్చితంగా చేపట్టాలని కోరారు. అనంతరం రైతులకు గడ్డి విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్ఏఏ చరిత తదితరులు ఉన్నారు.

అక్కమ్మ మృతి తీరనిలోటు

ఆత్మకూరు: పట్టణంలోని గొల్లపేటలో నివాసముంటున్న అక్కమ్మ మరణం సీపీఎంకు, మహిళా ఉద్యమానికి తీరనిలోటని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహానాయక్, మహిళా సంఘం నాయకురాలు మంజుల హరిత, పుల్లమ్మబాయ్, సువర్ణ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆరోగ్యం బాగోలేక ఇంట్లోనే నిద్రిస్తున్న సమయంలో అక్కమ్మ మరణించిందని తెలిపారు. అక్కమ్మ కుటుంబానికి సీపీఎం పట్టణ కమిటీ మహిళా సంఘం తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.రామ్‌నాయక్, ఎన్.స్వాములు, జోసెఫ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై దారుణానికి పాల్పడడం హేయం


విలేకరులతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండువీరయ్య మాదిగ

పగిడ్యాల: బాలికపై దారుణానికి పాల్పడడం హేయమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ తీవ్ర స్థాయిలో ఖండించారు. గురువారం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసు వ్యవస్థపై ప్రజలకు భయం లేకుండా పోయిందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి నేరం చేసిన వ్యక్తులకు అప్పటికప్పుడే శిక్షలు పడుతూ వచ్చి ఉంటే భయం ఉండేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముచ్చుమర్రి గ్రామానికి గుర్తింపు ఉందని అలాగే ఎమ్మెల్యే, ఎంపీలు ఈ గ్రామం నుంచి ఎన్నికైనా.. వారి ఊరిలోనే ఈ ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. కమ్యూనిటీ పరంగా కాకుండా నేరం చేసిన వ్యక్తులు ఎవ్వరైనా వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాలిక తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాయలసీమ ప్రధాన కార్యదర్శి పగడం రాఘవయ్య, జిల్లా నాయకులు నవీన్, శేఖర్, బాబు తదితరులు ఉన్నారు.

టీడీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

టీడీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అభిప్రాయపడ్డారు. గురువారం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌కు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మహిళా ప్రజాప్రతినిధులు అధికంగా ఉన్నారని, అయినా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న కొత్త ఎల్లాలలో ఆదివారం చిన్నారిని ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసి హత్యా చేయడం అమానవీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఐఎఫ్ఎస్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి

వెలుగోడు: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మోటివేషన్ స్పీకర్, ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి బి. శ్రీనివాస రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు శ్రీనివాసరెడ్డి మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మనిషికి అవయవ లోపం అనేది కేవలం ఒక నింద మాత్రమే అని, సాధించాలనే కృషి, పట్టుదల, సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. అందుకు తానే ఒక ఉదాహరణ అని చెప్పారు. తనకు దృష్టిలోపం ఉన్నప్పటికీ ప్రపంచంలో సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించిన మొట్ట మొదటి వ్యక్తి తానేనని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బ్రహ్మం నాయక్, హెచ్‌ఎం సత్య నారాయణ హెగ్డే , ఉపాధ్యాయులు రామకృష్ణ, మహమ్మద్ ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

అసరమైన ఎరువులను మాత్రమే వాడాలి

మహానంది: ఎరువులను అధికంగా వాడటం ద్వారా భూమి ఆరోగ్యం దెబ్బతింటుందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ డాక్టర్ సరళమ్మ తెలిపారు. బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో గురువారం సమతుల్య ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన మేరకు మాత్రమే ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు చంద్రశేఖర్‌రెడ్డి, స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడాలి

ఆత్మకూరు: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, సీనియర్ నాయకులు ఎం.రజాక్ కోరారు. గురువారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్య లోపం వల్ల ప్రజలు అంటురోగాలబారిన అతిసారావ్యాధితో, డయేరియాతో బాధపడుతున్నారన్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ప్రజలకు శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు ఎన్.స్వాములు, నాయకులు పాతకోట భాస్కర్, కలిముల్లా, చాంద్, రైట్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ పరిధిలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌ను బైర్లూటీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ గురువారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అక్కడ తాగునీటి వసతి, ఆహార పదార్థాల శుభ్రత గురించి అడిగి తెలుసుకున్నారు. ఏ చిన్న అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ షఫీమున్నీసా, వార్డెన్ శ్రీరాములు పాల్గొన్నారు.

సంతోష్ కుటుంబానికి ఆర్థిక సాయం

మహానంది: ఫొటో ల్యామినేషన్ పని చేస్తున్న గోపవరం గ్రామానికి చెందిన సంతోష్ ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు నంద్యాల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 26,500 నగదును సంతోష్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలి


రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు: ఎల్లాలలో ఎనిమిదేళ్ల బాలికను అత్యాచారం చేసి, హతమార్చిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రధాన రహదారి పై సీపీఐ ఆధ్వర్యంలో భాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రాస్తారోకో నిర్వహించారు. సంఘం నాయకులు రజిత, వినోద్, కిరణ్, మోసా, రంగస్వామి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

శ్రీశైలంప్రాజెక్ట్: కొత్త ఎల్లాల గ్రామంలో 8సంవత్సరాల బాలికను అతికిరాతకంగా హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని శ్రీశైలం మండల వాల్మీకి సంఘం నాయకులు గురువారం మండల డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. వాల్మీకి సంఘం నాయకులు మీనిగ చెన్నయ్య, నల్లబోతుల మల్లికార్జున, బోయ.పకీరప్ప, చిన్నకోటయ్య, ఎస్.శ్రీను, ఎస్.చిన్ని పాల్గొన్నారు.